



# సన్యాసిరావూ సరోజాదేవీ

శష్పబూతి సత్యనారాయణ

గబగబా మెట్లెక్కి హడావిడిగా రూములో పడ్డవాడినల్లా ఎదురుగా వున్న దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాను.

అదేమిటంటారా? మా సన్యాసిరావు లేడూ ముక్కు పొడుగ్గా ముఖం కోలగా, చర్మం ఎర్రగా, జుట్టు వంకీలుగా, శరీరం బరువుగా ఉండే వాడు, కెమిస్ట్రీ పుస్తకం తల్లక్రిందులుగా పట్టుకు చదివేస్తున్నాడు. అసలు వాడు ఎన్నో ఇక్కట్లు పరంపరలుగా వస్తేగాని పుస్తకం ముట్టడు. అలాంటి వాడీ రోజున పుస్తకం ముట్టాడంటే ఏదో ఇక్కట్టు కలిగిందన్నమాటే, సహజంగా వాడికి తరచు వచ్చే కష్టాలేమి టంటారా? సల్‌బండ్ అవ్వటం, అవసరంగా ఉన్నప్పుడు అయ్యర్ కాఫీ కొట్టు మూసెయ్యటం, నగరంలో కొత్త సినిమాలు (వాడు చూడనివి) లేకపోవటం ఇత్యాదులు చాలా ఉన్నాయ్—

అయితే ఈవ్వేళరోజున వాడికికలిగిన కష్టం ఏమిటో తెలుసుకుని నాలుగు అనునయ వాక్యాలు పలుకుదామని కెమిస్ట్రీ బుక్ లోంచి, ముఖ నా ప్రక్కకు త్రిప్పుకుని—

"చిట్టి నాయనా! ఎందుకు విచారిస్తావ్— కష్టాలు మానవులకు కాక మానులకు వస్తాయా— నువ్వు రామాయణ మహాభారతం చదివావ్ లేదో (నేనూ చదవలేదులెండి) అందులో మహా గొప్పగొప్ప వాళ్ళయిన నలుడూ, హరిశ్చంద్రుడు మొదలైన మహారాజులకే కష్టాలు తప్పలేదు, సీతకు రాము డేమవుతాడో తెలియదుగాని ఒకళ్ళకోసం ఒకళ్ళు ఎన్నన్ని బాధలు పడ్డారో నీకేం తెలుసు గనుక. నేను చూసేను గనుక (సినిమాలో) నాకు తెలును— అలాంటివాళ్ళకే ఇక్కట్లు తప్పనప్పుడు ఇక మనం ఏ పాటివాళ్ళం' అన్నాను. ఇంత పెద్ద డైలాగు చెప్పినా వాడిలో మార్పు కానరాలేదు.

"చెప్పు వెర్రివాన్నా! నీ కొచ్చిన ఇక్కట్టు నే తీరుస్తాగా చెప్పు. ఇంట్లో సల్‌బండ్ అయిందా?"

"ఊహూ."

"కొత్త సినిమా ఏదీ లేదా?"

"ఊహూ."

"మరి నా తలకాయ్! నీ కొచ్చిన ఇక్కట్టేమిట్రా" అన్నాను కొంచెం చిరాగ్గా.

"ఆ సరోజ లేదూ!"

"ఏ సరోజ!"

"ఫూల్ అండ్ హాస్, (అనగా వెధవన్నరా అని అర్థం) మన క్లాసుదేనని మొన్న చూపించలేదూ!" అన్నాడు.

అసలు అమ్మాయిలంటే గిట్టని ఈ సన్యాసి రావుగాడు అమ్మాయిల గురించి మాట్లాడగానే, ఇదేదో మిస్టరీలాగుందే అని కుర్చీ దగ్గరగా లాక్కొని "చెప్పరా" అన్నాను.

"నేను చెప్పను."

"బాబ్బాబు, నో డిటెక్టివ్ నవల చదివినంత పుణ్యం ఉంటుంది చెప్పరా బాబూ" అన్నాను గెడ్డం పట్టుకుని బ్రతిమాలుతూ.

"అదేం ...." అని మళ్ళీ ఆపేశాడు.

"ఊఁ! వెంటబడ్డావా? బాడీగార్డ్ అందా? చెంప పగలగొట్టిందా?"

"అందుకే నిన్ను వెధవన్న రన్నాను."

వీడితో ఒక చావుగాదు "పోనీ ఏమైందో చెప్పు."

"ఆ అమ్మాయే నా వెంట బడింది. నిజంగానా గుండె దడ పట్టుకుందంటే నమ్ము."

నేను వింటున్నదీ, కంటున్నదీ కలేమో అనుకుని ఎందుకైనా మంచిదని ఒకసారి గిల్లుకు చూసుకున్నాను. ఎందుకంటారా. ఈ రోజుల్లో అమ్మాయిల వెనుక అబ్బాయిలు పడి నానాతిట్లు అగచాట్లు పడుతున్నప్పుడు వీడి వెనుక నిప్పులాంటి దనుకునే సరోజాదేవి పడిందంటే నమ్మవలసిందిగా ఆట్టే అనిపించలేదు.

"అసలేం జరిగిందో వివరంగా చెప్పు" అన్నాను.

"నువ్వు క్లాసు వదిలి సినిమాకు చెక్కగానే, తరువాత అవర్ క్లాసు 'లెక్చరర్ రానందున క్యాన్సిల్' అని అధికారవార్త ప్రకటించారు. కొంచెం లేటుగా బయలుదేరి కాలేజీ వొదిలి రోడ్‌మీద పడేసరికి ఆ దేవి నా వెంట జేరింది. తన దారిన తాను పోతుందో దనుకున్నాను. కాని అలా జరుగలేదు. నేను ఎలా వెళితే అలాగ, ఎంత వేగంతో నడిస్తే, అంత వేగంతో అనుసరిస్తోంది. అప్పుడీ విషయం ఛాయామాత్రంగా అర్థమై, గుండె దడపట్టి, శరీరం వొణుకుపట్టిం దనుకో. ఎవరైనా చెప్పి

కాపాడతారనే ఆశతో గట్టిగా గావుకేక వేయ బోయాను. కాని నోరు పెగల్లేదు. ఇక నన్ను ఈ బారినుండి కాపాడేవారే లేరా, ప్రపంచం గొడ్డు పోయిందా, న్యాయం ధర్మం నశించిందా ఇక అవ ధ్యాంధవుడైన ఆ భగవంతుడే దిక్కనుకుని కళ్ళు తెరుచుకుని పడిచి పడిచి చిట్టచివరకు మన రూమ్‌లో పడ్డాను ఎలాగో" అన్నాడు వగురుస్తూ.

ఇదెక్కడి కర్మరా నాయనా అనుకుని కుర్చీలో కూలబడ్డాను.

"ఏతే ఏమంటావ్" అడిగాను.

"తక్షణ కర్తవ్యం ఆలోచించాలి."

"బుద్ధిగా ఆ అమ్మాయిని ప్రేమించు."

"అసలు ప్రేమంటేనే నాకు గిట్టదు, అసహ్యం, రోకు ..... "

"పోనీ పెళ్ళి చేసుకోరాదూ."

"అమ్మ బాబోయ్. అంటవనే, మా బాబు తన్ని తగలేస్తాడు" అన్నాడు ఒక్కసారి కుర్చీలోంచి లేచి క్రిందపడి.

*       *       *

అప్పుడే లోకల్ పోస్టులో వచ్చిన కవరు అంద కుని బుట్టలోంచి పామును తీస్తున్న వాడిలా భయపడుతూ కవరులోపల ఉన్న సరుకును బయట తీసినవాడల్లా చూస్తూనే కొయ్యబారిపోయాడు. కాసిని నీళ్ళు తెచ్చి వాడి మొహానికి కొట్టి, చేతిలో కవరు లాక్కున్నాను.

అది సరోజాదేవి వ్రాసిన ప్రణయలేఖ.

"మై డియర్ సన్యాసిరావుగారూ !

నిన్న మీవెంట ఎందుకు పడ్డానో ఈపాటికి తెలిసే ఉంటుంది. దారిలో ఎన్నో విషయాలు చెప్పాలనుకున్నాను. మీ వ్యవహారం చూసి చెప్పలేక పోయాను. ఇక అసలు విషయానికి వస్తున్నా వినండి.

మిమ్మల్ని ఈ నాలుగు సంవత్సరాల నుంచి స్టడీ చేస్తున్నా. అమావాస్యకు పౌర్ణానికి కాలేజీకి వస్తున్నా, క్లాసులో వెనుక బెంచీలో కూర్చుని హాయిగా కలవరిస్తూ నిద్రపోతున్నా, అసలు లెక్చరర్స్ (ఒక్క ప్రిన్సిపాల్ అంటే తప్ప) అంటే కాస్తయినా భయమూ, భక్తీ లేకపోయినా, మీరంటే నాకు ఎంతో ఇష్టం. మీరు కాలేజీకి వచ్చినప్పుడు పడే యిబ్బందులు ఏమిటంటే, లెక్చరర్ ఎవరో తెలీకపోవటం, తెలిసినా, ఒకవేళ పాఠం విన్నా, ఆయన చెబుతున్నది, ఫిజిక్సో, కెమిస్ట్రీయో తెలియకపోవటం .... ఇత్యాదులు అని వూహించాను.

ఇన్ని సద్గుణాలుండిబట్టే మిమ్మల్ని అమాంతంగా ప్రేమించేశాను. గనుక గప్‌చిప్‌గా పెళ్ళి చేసుకుందాం. ఏమంటారు ?

ఎంతైనా ఆడదాన్ని గనక నేనే సాహసం చేయ వలసి వచ్చింది మరి.

ఇట్లు, మీ
సరోజాదేవి."

ఇదంతా విని వాడి ముఖం కందగడ్డలా అయిపో యింది. బోలెడంత కోపం వచ్చింది. నా చేతిలోంచి బలవంతంగా ఉత్తరాన్ని లాక్కొని కాలేజీకి పరు గెత్తాడు.

*       *       *

ప్రిన్సిపాల్ రూమ్‌లోకి అడుగు పెట్టేసరికి, టేబిల్‌కు చెరో ప్రక్కా ఎదురుబదురుగా నిలు చున్నారు.

"ఏమమ్మా సరోజాదేవి, ఈ ఉత్తరం నువ్వు వ్రాసిందేనా ?" అడిగారు ప్రిన్సిపాల్.

"నేనేనండీ" తలను వంచుకోకుండా సమా ధానం యిచ్చింది.

"ఇలాంటి క్రమశిక్షణారహితమైన పనులు చేయకూడదని తెలీదా ?"

"తెలుసండీ."

"మరి తెలిసుండీ ఎందుకు వ్రాశావ్."

"వ్రాయాలనే నండి."

ఆ దెబ్బతో ప్రిన్సిపాల్‌గారికి విజయవాడ ప్లాట్ ఫ్లారమంత కోపం వొచ్చింది.

"నీకు బొత్తిగా క్రమశిక్షణ లేదు. నిన్ను డిస్ మిస్ చేస్తున్నాను."

"చాల థాంక్సండీ, నేనే మానెయ్యా లనుకుంటు న్నాను."

"ఈ విషయం మీ పేరెంట్స్‌కి రిపోర్టు చేస్తాను."

"మెనీ మెనీ థాంక్స్! నాకు శ్రమ తగ్గించినవా రవుతారు."

"గెటవుట్" అన్నారు హాలు అదిరిపోయేలా.

"నేనే వెళ్ళిపోవా లనుకుంటున్నాను." "ఉండ మన్నా ఉండను" అంటూ వెళ్ళిపోయింది.

"థెంకి డాని టి" అన్నారు, కళ్ళజోడు తీసి తుడుచుకుంటూ.

"వెళ్ళవోయ్ సన్యాసిరావ్! ఈలాంటివి మళ్ళీ రాకుండా చూడు."

"నేనేం చెయ్యనండి, నా తప్పేం లేదుగా" పైకి అని, "అక్కడికీ ఇలాంటి గొడవ లొస్తాయని కాలేజీకి అట్టే రాను" అనబోయి నాలిక్కరుచుకున్నాడు.

మెట్లుదిగి క్రిందికి వెళుతుంటే వరాండాలో నిలుచుంది సరోజాదేవి.

"ఏమండీ సన్యాసిరావుగారూ. ఇంతతోనే మిమ్మల్ని వొదిలేశా ననుకోకండి" అంటూ చరచరా నడిచి వెళ్ళిపోయింది.

పరీక్ష అయిపోయాయ్. మా సన్యాసిగాడు అప్పర్ బుక్‌లు ఖాళీగా వదిలెయ్యట మెందుకని, ఏ సినిమా స్టోరీయో, శవసాహిత్య తాలూకూ నవలల్లో హంతకు డెవరో రాసి వచ్చి "బాగానే వ్రాశా నండీ, ఫరవాలేదు. పాసు మార్కులు మట్టుకు వస్తాయ్, చాల తెలిగ్గా యిచ్చాడు పేపరు, అను కున్న వన్నీ తగిలాయ్ నుమండీ" అనేవా డెవరైనా అడిగితే.

ఆఖరురోజున పేపరు వ్రాసి ఇంటి కొచ్చేసరికి సన్యాసిగాడికి ఇంటిదగ్గరనుంచి ఉత్తరం వొచ్చి పడింది. అందు ఏముందంటే "ఒరేయ్ సన్యాసి రావ్! ఫలానా తారీఖు నీకు పెళ్ళి చేయటానికి నిశ్చయించాను. కాబట్టి నీ స్నేహితులందర్నీ రమ్మని చెప్పి వెంటనే బయలుదేరు" అని ఉంది.

"ఒరేయ్ ఇలాంటి పెళ్ళి నా కిష్టంలేదు. కనీసం పెళ్ళికూతుర్ని చూసుకొనే అవకాశం కూడ ఇవ్వలేదు" అంటాడనుకున్నాను. కాని అలాంటిదేమీ



జరగలేదు. బుద్ధిమంతుడులా తల వంచుకుని సిగ్గుపడుతూ ఆ రాత్రికి రాత్రే బండెక్కేశాడు.

*       *       *

పిడిది అంతా కళకళ లాడుతోంది. మిత్రు లంతా పేకాట వేశారు. సన్యాసిరావ్ పెళ్ళికొడుకై నిండుగా కుర్చీలో కూర్చున్నాడు.

అంతలో కొందరికి పెళ్ళికూతుర్ని చూసి వద్దామని బుద్ధి పుట్టింది. కానీ ఇప్పు డామె, ఆ వైకుంఠ నగరిలో, ఆ మేడలో, ఆమూల గది యందు, ముహూర్తానికి నాలుగు గంటల ముందు నుంచే మేకప్ ప్రారంభించిందని, దర్శనం కావటం దుర్లభమని ఎవరో అనటంచేత ఆ కార్యక్రమం ఆగిపోయింది.

మేము పేకాటలో పడి కొట్టుకుంటూ ఉండగా

46-వ పేజీ చూడండి

# సన్యాసిరావూ సరోజాదేవి

13-వ పేజీ తరువాయి

సన్యాసి కుర్చీలో పడి ఘోరంగా నిద్రపోతుండగా, పెళ్లిపీటల మీదికి వెళ్లటానికి సమయం ఆసన్నమై వచ్చిందని పెళ్లికుమారునికి మేకప్ చేయమని పెళ్లికుమార్తె తరఫువారు వార్నింగ్ యిచ్చారు.

ఇక నిద్రపోతున్న సన్యాసిరావును లేపటం ఎంత తేలికంటే, రాకెట్ వేయకుండా చంద్రమండలానికి వెళ్లటమంత తేలిక. వాడిని నిద్ర లేపటానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారు, దానికి నేను అధ్యక్షుణ్ణి.

అరగంట తర్వాత కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయానికి వచ్చింది. అదేమిటంటే ఇక సన్యాసిరావును నిద్రలేపటం దుర్లభమని. ఎంత చెడ్డా రూమ్ మేటుని నేనేగా, వాడు తిట్టినా, కొట్టినా పడదడానికి. వాడి భుజాలు రెండూ పట్టుకుని లేవదీశాను.

"ఒరే నాన్నా ముహూర్తం సమీపిస్తోంది. అవతలవారు తొందర పెడుతున్నారు. ఉపాహారం కాస్త లేదూ" అన్నాను.

"ఫూల్ అండ్ ఫూఫ్ (అర్థం ఇదివరకే చెప్పాను) నీకెప్పుడూ చెప్పేది. మరీ లేకపోతే సరి అర్ధరాత్రి పెళ్లేమిటి, బుద్ధిగా నిద్రపోండి, పొద్దున్నే లేచి కాఫీలు తాగి చూద్దాం" అన్నాడు.

ఈ తతంగమంతా లోపలిగది కిటికీలోంచి ఆడవాళ్లంతా చూస్తున్నారు కాబోలు ఒక్కసారి ఫక్కున నవ్వారు.

"మంచి బావే, మొద్దు నిద్ర బావ" అంది నవ్వుతూ వాడి కాబోయే మరదలు కాబోలు.

'అప్పుడే బావతో వేళాకోళాలు ప్రారంభించావా, నా చిట్టి తల్లీ' అనుకున్నాను మదిలో.

ఇక వాడిని లేపే విధానం కాస్సేపు ఆలోచించి,

"ఎందు మలుపు అయ్యర్ హోటల్లో చక్కగా ఇద్దరం కాఫీ త్రాగుదాము, లే" అన్నాను మామూలు రూమ్‌లో మాట్లాడే ధోరణిలో

"ఊహూ."

"పోనీ రెండు సినిమాలు ఏకోదవున చూద్దాం. ఏం! లేస్తావా!"

"ఊహూ, పో, అవతలికి" అన్నాడు.

ఇక నాకు మతి పోతోంది. ఏం చేయాలో తోచలేదు. భగవంతు డనేవాడు ఉండబట్టి అలాంటి క్లిష్టసమయంలో మంచి ఆలోచన తట్టింది.

"ఒరేయ్, రావూ, ప్రిన్సిపాల్ క్లాసులోకి వస్తున్నాడు, లేరా బాబూ, కొంప మునిగిపోయింది" అన్నాను గాబరాగా. ప్రిన్సిపాల్ అంటే సింహస్వప్నం ఏమో ఆపేరు వినగానే ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. ఇక ఆలస్యంచేస్తే లాభంలేదని ఎంచి ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి నోటికి అందించాను. ఒక్క నిముషంలో కాఫీ కప్పు ఖాళీచేసాడు. అప్పటికి వదిలింది వాడి నావహించిన నిద్రాదెయ్యం.

"ఎంత బావుందిరా కాఫీ ఎవరు చేశారంటా" అన్నాడు.

"నీ కాబోయే శ్రీమతి" అన్నాను వాడి వాలు తెలిసిన వాడిని గనుక.

ఒక్కసారి ఎగిరి గంతేశాడు.

"ముహూర్తం దాటిపోయిందా !" అన్నాడు.

"లేదు తొందరగా తయారవ్వాలి" అన్నాను.

"అయితే నాకు తొందరగా మేకప్ వెయ్" అన్నాడు.

చకచకా అయిదు నిమిషాల్లో మేకప్‌చేసి పెళ్లిపీటలమీదికి తీసుకువెళ్లాను.

* * *

వాడి ప్రక్కన కూర్చొన్న పెళ్లికూతుర్ని చూసి అయిదు నిమిషాలుపాటు నాకేమాటా రాలేదు.

"రక్షించరా బాబూ!" అని గట్టిగా ఘటోత్కచుడులా అరుస్తా డనుకున్నాను. కానీ ఆ పని మాత్రం చేయలేదు. ఆ భావం చూపించేలా కళ్లతోనే అర్థించాడు. "ఇక లాభంలేదు. వేళ దాటిపోయింది." అని కళ్లతోనే సమాధానం యిచ్చాను.

ఇంతకీ ఆ విచిత్రం ఏమిటంటారు. వాడి పక్కన కూర్చోబెట్టిన పెళ్లికూతురు వాడి వెంటబడి మూడు చెరువుల నీళ్లు తాగించి, 'నీ అంతు కనుక్కుంటా' నని ప్రతిజ్ఞ బూనిన సరోజాదేవి.

ఇక రావుగాడు చేసేదిలేక సరోజాదేవి వంక దీనంగా చూస్తున్నాడు.

"ఇంకెక్కడికి పోతావ్, పట్టుబడ్డావ్, చూసేవా నా సంగతి" అన్నట్టున్నాయ్ ఆమె రావ్‌కేసి ముసిముసి నవ్వులు నవ్వుతూ చూసే చూపులు.

తెల్లవారేసరికి సన్యాసిరావ్ కళ్యాణం సలక్షణంగా ముగిసి సంసారియై కూర్చున్నాడు.

కొన్ని నెలల తరువాత అత్తవారి వూరినుంచి వూడిపడిన సన్యాసిరావ్ ఏమన్నాడంటే, "ఒరేయ్ అనవసరంగా గాబరాపడ్డాను గాని, ఎంత మంచిదనుకున్నావ్" అన్నాడు.

"మంచిది ఎవర్రా ?" అన్నాను ఏమీ తెలియని వాడిలా.

"అందుకే ఇదివరకే అన్నాను నేను, నువ్వు 'ఫూల్ అండ్ ఫూఫ్' వని .... అది అంటే అర్థం నా శ్రీమతి అని" అన్నాడు రొమ్ము విరుచుకుని.

"అమ్మయ్య, బతికేన్రా బాబూ" అనుకుని వూపిరి పీల్చుకున్నాను— ★

# శ్రీదేవి

20-పేజీ తరువాయి

అనీ, సాయంకాలం లోపల ఆమె గనక తన కా డబ్బు తెచ్చివ్వకపోతే ఆనాటితో తనకూ ఆమెకూ సంబంధం తెగిపోతుందనీ, నిష్కర్షగా చెప్పి, బయటకు వెళ్లాడు. ఒకరోజు ప్రొద్దున్న అంతవరకూ వేణు తనని వదిలి వెళ్తాడనే ఆలోచన ఆమెకు కలుగలేదు. ఆరోజు వేణు అలా అనడం ఆమెకు షాక్ తగిలినట్లయ్యింది. ఇప్పుడేం చెయ్యాలి? వేణు ఆ మాట అనిన తీరుచూస్తే నిజంగా తనను వదిలేసేటట్లున్నాడు. అతను తనను వదిలేస్తే తన గతేమిటి? అసలే సుభద్రమ్మకూ, తనకూ మాటలు లేవు. పైగా, తనకు ఏడవమాసం వస్తోంది. పురుడెలా జరుగుతుంది? భవిష్యత్తును తను ఒక్కర్తీ ఏమి ఎదుర్కోగలదు? ఎంతైనా వేణు తన భర్త. అతనిని కాదని లాభంలేదు. తను, తల్లి నడిగితే తల్లి తప్పక డబ్బిస్తుంది. కాని, అక్కడకువెళ్లి అడిగే ధైర్యమే తనకులేదు. పోనీ, చీటి రాసి పంపితే? అలా చేద్దామనుకొంది శ్రీదేవి. కాగితం, కలంతీసి కూర్చుంది రాయడానికి. "ప్రియమైన అమ్మకు" అని మొదలుపెట్టింది.

సరిగ్గా ఆ సమయంలోనే సావిత్రి వచ్చింది. శ్రీదేవి చేతిలో కాగితం, కలం చూచి, ఆమె ఏం చేస్తోందో అడిగింది. శ్రీదేవి ప్రొద్దున వేణు అన్న మాటలు చెప్పింది. తను, వేరే గత్యంతరంలేక డబ్బుకోసం తల్లికి ఉత్తరం రాస్తున్నానని చెప్పింది.

సావిత్రి వద్దన్నట్టు తలూపింది.

"వద్దు చెల్లీ! నువ్వు డబ్బు తెప్పించద్దు. ఒకసారి నువ్వాపని చేశావంటే, అతను ఎప్పుడూ అదే చెయ్యమంటాడు."

"ఎప్పుడూ చెయ్యమన్నా, నేను బహుశా అదే చెయ్యాల్సి ఉంటుందేమో! అంతకన్నా, నా కాపురం నిలబెట్టుకునే మార్గం నాకు తోచటంలేదు. ఆత్మాభిమానంకోసం ఆయనతో దెబ్బలాడి అలసిపోయాను. భవిష్యత్తు తల్చుకుంటే భయమేస్తోంది! కానీ! ఆయనకు నావల్ల—ఇక డబ్బు రాదూ—అని తెలిసేవరకూ, మావాళ్ల దగ్గర్నుంచి డబ్బు తెప్పిస్తాను. వాళ్లు ఇవ్వడం మానేస్తే, ఆయనకే తెలుస్తుంది, నా లోపం ఏమీ లేదని."

"అయితే నువ్వు డబ్బు తెప్పించినంతమాత్రాన నిన్ను సరిగా చూస్తాడనుకున్నావా? అతనికి నీమీద అభిమానమేఉంటే, అసలా డబ్బుతో నిమిత్తమే లేకుండా బాగా చూసేవాడు. ఏనాడైతే నిన్నొక వ్యక్తిగా, తన జీవిత సమభాగినిగా చూడడం మానేశాడో, అప్పుడే అతను నీనుంచి దూరమయ్యాడు. ఇప్పుడు నిన్నొక—డబ్బును సమకూర్చుకోవడానికి పనికివచ్చే—యంత్రంగా వినియోగించదల్చుకొన్నాడు. నువ్వు కూడా అందు కంగీకరిస్తే, అతని యత్నం సఫలమవుతుందేగాని, నీ కోరిక నెరవేరదు. డబ్బు కావలిసి వచ్చినప్పుడల్లా నిన్ను ఉపయోగించుకుంటాడు. నువ్వు అతనికి డబ్బు ఇవ్వడం కూడా కొంతవరకే సాధ్యం. ఆ తరువాత నీ అవసరం అతనికి ఉండదు. అప్పుడు మళ్లీ కథ మొదటికి వస్తుంది" అంది సావిత్రి.

ఈ ఆలోచనలు శ్రీదేవి మనస్సులో కూడా కలుగుతూనే ఉన్నాయి. కాని, ఆమె 'సతీ ధర్మమ'నేది ఒకటి ఉందనీ, దానిని నెరవేర్చడం తన కర్తవ్యం అనే ఉద్దేశంతో, ఏ నిర్ణయానికి రావటం లేదు. తరతరాలుగా భారతదేశపు స్త్రీ, పతియొక్క పాదాలవద్ద ఆత్మార్పణ చేసుకుంటోంది. ఆ పతి ఎలాటివాడైనా సరే, అతని కోరికలు ఎంత దుస్సాధ్యములైనా సరే, భార్య మారాడక నెరవేర్చి తీరవలిసిందేనని మతం బోధిస్తోంది. ప్రతి స్త్రీ కూడా దానినే నమ్మి, ఆచరిస్తోంది. ఆ చారంలోనూ, ఆ బోధలోనూ స్త్రీకి వ్యక్తిగతమైన ప్రాముఖ్యత లేదు. తన కొక వ్యక్తిత్వముందనీ, దానిని నిలబెట్టుకోవలసిన అవసరముందనీ ఆమె ఆలోచించరాదు. భర్తను ఎన్నుకొనేవరకే, వివాహమయ్యేదాకానే ఆమె ఒక వ్యక్తి. తరువాత ఆమె భార్య మాత్రమే. ఇలాంటి భావాలు మనకు పురాణాలలో కోకొల్లలుగా కన్పిస్తాయి. అవి చదివి ఆనందించటానికి ఎంతో బావుంటాయి. ఎంత త్యాగం! ఎంత పతివ్రతా మహిమా! ఏమి ఆదర్శం!